# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### కౌలుదారు చట్టం.. మొదటికే మోసం..

కాంగ్రెసోళ్లు తెలంగాణలో అధికారంలోకి వస్తే కౌలుదారు చట్టాన్ని తీసుకొస్తామంటున్నారు. దీనివల్ల భూమి పట్టాదారుకు మొదటికే మోసం వస్తుంది. వ్యవసాయం చేయలేనివారి భూములతో కౌలుదారుకే లాభం. భూములు కౌలుకు ఇవ్వడానికి ముందుకు రారు. కాంగ్రెస్ పార్టీ కౌలురైతుల పొట్ట గొట్టే పనులు చేయడం మానుకోవాలి.

**– తుల్సీరాం, పటేల్‌చెరువు తండా(కులకచర్ల)**



### ధరణితో పట్టామార్పిడిల దరిద్రం పోయింది..

భూ పట్టాలను మార్పిడికి అనేక ఇబ్బందులు పడ్డాం. దళారులను నమ్ముకొని లంచాలు ఇస్తూ మోసపోయాం. ధరణి పోర్టల్ వచ్చాక రైతులు, సామాన్య ప్రజలు పట్టామార్పిడిలు, భూముల రిజిస్ట్రేషన్ల ఇబ్బందులు తొలిగాయి. లంచాల బాధ లేకుండా పట్టా అవుతున్నది.

**– నారాయణగౌడ్, తట్టేపల్లి (పెద్దేముల్)**



### మళ్లీ దళారీ వ్యవస్థ వస్తది..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామని అంటున్నారు. మళ్లీ దళారీల వ్యవస్థ వచ్చి పీక్కు తింటారు. గత కాంగ్రెస్ హయాంలో పడిన ఇబ్బందులు చాలు. కాంగ్రెస్‌కు అధికారమంటే తడి గుడ్డతో గొంతు కోసుకోవడమే. ధరణిని రద్దు చేస్తే రైతు బంధు డబ్బులు కాంగ్రెస్ ఇంటికి తెచ్చి ఇస్తుందా ?

**– తలారి కృష్ణ, గ్రామం అగ్గనూరు(యాలాల)**



### పాత కాలం రికార్డుల్లో 56 కాలమ్స్..

కౌలుదారు చట్టం తెస్తే పాత కాలంలో రికార్డుల్లో 56 కాలమ్స్ ఉండేవి. కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు చెబుతున్నది. ఒక్క కాలం తప్పుగా రాసినా పని జరగదు. మళ్లీ పని చేయడానికి డబ్బులు అడుగుతారు.

**– నానావత్ హమ్యా నాయక్, గ్రామం పెర్కంపల్లి తండా(యాలాల)**



### కౌలుదారు చట్టం రైతన్నలకు నష్టం..

కౌలుదారు చట్టంతో రైతన్నలకు నష్టం జరుగనున్నది. పట్టాదారు కౌలుకు ఇవ్వకపోతే ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉన్నది. కాంగ్రెస్ అధికారంలోకి వ్యవసాయం ఆగమైతది. కాంగ్రెస్ వస్తే రైతులకు కష్టాలు తప్పవు.

**– పవార్ లక్ష్మణ్ నాయక్, గ్రామం పెర్కంపల్లి తాండ(యాలాల)**



### కౌలుదారు చట్టం తెసే కష్టాలు తప్పవు..

కౌలుదారు చట్టం తెస్తే రైతులకు కష్టాలు తప్పవు. కౌలుకు భూమి ఇస్తే భవిష్యత్‌లో కిరికిరిలు వస్తాయి. ధరణి వల్ల రైతులకు మేలు చేకూరుతున్నది. కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేయాలని చూస్తున్నది. యజమానులు కౌలుకు ఇవ్వడానికి వెనుకాడుతారు.

**– సుబ్బారెడ్డి, రైతు, ఖుదావంద్‌పూర్(పరిగి టౌన్)**



### కౌలుకు ఇవ్వాలంటే భయపడాల్సిందే..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే భూమి కౌలుకు ఇవ్వాలంటే భయపడాల్సిందే. రాతపూర్వకంగా రాసి ఇస్తే కౌలుదారు కోర్డును ఆశ్రయించే ఆస్కారం ఉంటుంది. తద్వారా యజమానికి భూమిపై రక్షణ లేకుండా పోతుంది. కౌలుకు ఇచ్చేకన్నా పడావ్ పెట్టుకోవడం మంచిది. ఇటువంటి ఆలోచనలు చేసే కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాల్సిందే.

**– మొగులప్ప, దేవర్‌ఫసల్‌వాద్(దౌల్తాబాద్)**



# రైతుల నెత్తిన.. భస్మాసుర 'హస్తం'!

- కౌలుదారు చట్టంతో మళ్లీ వివాదాలు ఖాయం..
- తమ భూమిని విక్రయించాలంటే కౌలుదారుకే మొదటి ప్రాధాన్యం!
- ఏడాది ముందు నోటీసు ఇస్తేనే విక్రయించేందుకు అవకాశం
- కౌలుదారు చట్టం ప్రకారం ఐదేండ్లపాటు కౌలు ఇవ్వాల్సిందే
- కౌలుదారు చట్టంతో అసలు యజమానులకు కొత్త చిక్కులు
- కాంగ్రెస్ తీసుకువస్తామన్న కౌలుదారు చట్టంపై జిల్లా రైతాంగం ఆగ్రహం

వికారాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కౌలుదారు చట్టాన్ని తీసుకువస్తామన్న వ్యాఖ్యలపై జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. కౌలుదారు చట్టంతో అసలు భూయజమానులు కౌలుకు ఇచ్చే భూములపై యాజమాన్య హక్కులు కోల్పోయే ప్రమాదం ఉన్నది. ఒక్కసారి కౌలుదారుకు భూమిని ఇచ్చినట్లయితే తప్పనిసరిగా నిర్ణీత గడువు వరకు కౌలు భూముల నుంచి తొలగించేందుకు వీలుండదు. ఒకవేళ కౌలు రద్దు చేయాలంటే ఏడాది ముందు నోటీసు ఇస్తేనే కౌలును రద్దు చేసే పరిస్థితి ఉంటుంది. భూ యజమానులు తమ భూమిని కౌలుకు ఇచ్చేందుకు నిర్ణయించినట్లయితే తప్పనిసరిగా ఐదేండ్లపాటు కౌలుకు ఇవ్వాల్సి ఉంటుంది. ఐదేండ్లకు కౌలు రద్దు చేసుకోలేనట్లయితే ఆటోమేటిక్‌గా మరో ఐదేండ్లు కౌలు పొడిగింపబడుతుందనే చట్టం ద్వారా తెలుస్తున్నది. దీంతో అసలు భూయజమానులు కొత్త కష్టాలు మొదలు కానున్నాయి. కౌలుకు ఇచ్చిన అనంతరం సంబంధిత భూమిపై ఎలాంటి యాజమాన్య హక్కులు భూ యజమానులకు ఉండవని స్పష్టమవుతున్నది. ప్రధానంగా కౌలుకు ఇచ్చిన భూమిని విక్రయించే సమయంలోనూ కౌలుదారుకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుంది. కౌలుకు ఇచ్చిన భూములను భూ యజమాని ఎవరికి పడితే వారికి అమ్ముకోవడానికి వీల్లేదు, అమ్ముకోవాలంటే మొదట కౌలుదారుకు అవకాశమిచ్చి, కౌలుదారు తీసుకోలేని పరిస్థితిలోనే ఇతరులకు విక్రయించాల్సి ఉంటుంది. కౌలుకు ఇచ్చే సమయంలో నోటి మాటపై కాకుండా కాగితం రాసుకోవాల్సి ఉంటుంది. ఇలా కౌలుదారు చట్టంతో అసలు భూ యజమానుల కంటే కౌలుదారులకే హక్కులు కల్పించే పరిస్థితితో రైతులు కౌలుదారు చట్టం పూర్తి వ్యతిరేకత చూపుతున్నారు. ఒకవేళ కౌలుదారు చట్టం అమల్లోకి తీసుకువస్తే ప్రస్తుతం సాగులో ఉన్న భూములు కూడా బీడు భూములు గా మారే పరిస్థితి ఉన్నది.



### కౌలు ఒప్పందమంటే ఇబ్బందే..



రాతపూర్వకంగా కౌలు ఒప్పందం చేసుకోవడమంటే రైతులకు ఇబ్బందే. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కౌలు చేసేవారికే భూమిపై హక్కు కల్పిస్తుంది. దీంతో భూమిని కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇటువంటి కౌలుచట్టం మాకొద్దు. ధరణి వల్ల ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యాయి. ఎలాంటి చింత లేకుండా సాగు చేసుకుంటున్నాం. రైతుల కోసం అనేక పథకాలు తీసుకొచ్చిన బీఆర్ఎస్ పార్టీకే నా మద్దతు.

**– ఎం.రాములు రైతు అంగడి చిట్టంపల్లి(పూడూరు)**

### కౌలుకు ఇవ్వను.. ఆగం కాను..



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కష్టాలు కొనితెచ్చుకున్నట్లే. భూమి కౌలుకు ఇస్తే వచ్చే డబ్బులు కాగా పంచాయితీ వస్తది. భవిష్యత్తులో వివాదాలకు దారి తీస్తుంది. నా భూమికి రక్షణ ఉండదు. ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ కౌలుదారు చట్టమంటూ నాటాకాలాడుతున్నది. ఇటు రైతులు, అటు కౌలుదారుల పొట్టకొట్టాలని చూస్తున్నది. ధరణి వచ్చాక ఎలాంటి సమస్యలు లేవు. బీఆర్ఎస్ పార్టీకే నా మద్దతు.

**– ఎన్ కేశవులు, దుప్పటిగట్టు (మద్దూరు)**

### ధరణిని తొలిగిస్తామనడం దుర్మార్గం..



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణిని తొలగిస్తామని అనడం దుర్మార్గం. ధరణి వచ్చిన తరువాతే దళారీ వ్యవస్థకు చెక్ పడింది. అన్ని డాక్యుమెంట్లు సరైనవిగా ఉంటే ఐదు నిమిషాల్లో భూమి హక్కు పత్రాలు చేతికి వస్తున్నాయి. ఇంతటి మంచి వ్యవస్థ కలిగిన ధరణి పోర్టల్‌ను తొలగిస్తామనడం కాంగ్రెస్ మూర్ఖపు చర్య. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ముందు చూపుతో తీసుకొచ్చిన ధరణితో ఎన్నో సమస్యలు తొలగిపోయాయి.

**– హన్మంత్‌రెడ్డి, మైల్వార్(బషీరాబాద్)**